సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 24 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

జనవరి 2న జెడ్పీ సమావేశం

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జనవరి 2వ తేదీన జరుగుతుందని జెడ్పీ సీఈఓ రమేష్ శనివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు రెడ్డి సంక్షేమ భవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు, సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం: చాడ



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి ఇండియా కూటమితో పాటు బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేయడానికి సీపీఐ ప్రధాన భూమిక పోషిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన సీపీఐ పొత్తు పెట్టుకున్న తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మిగతా నాలుగు రాష్ట్రాల్లో పొత్తు ఉంటే అక్కడ కూడా అధికారం వచ్చేదేమోనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కార్యకర్తలను సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఈనెల 26న జరిగే సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, కర్రె భిక్షపతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, శ్రీనివాస్, వివిధ మండలాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో గ్రహక్ దివస్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ గ్రహక్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజలకు మేలు చేసే అనేక చట్టాలున్నాయన్నారు. వినియోగదారులను దోపిడీ నుంచి రక్షించేందుకు వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు. 1986 డిసెంబర్ 24న ఈ చట్టాన్ని తీసుకురావడంతో ఏటా జాతీయ వినియోగదారుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకొని నాణ్యమైన వస్తుసేవలు పొందాలని సూచించారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ద్వారా కామర్స్ విభాగాధిపతి హరిప్రసాద్ చట్టం ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ సామ సువర్ణాదేవి, కిషోర్, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను కాపాడుకుందాం
రైతు సంక్షేమ కార్యకర్త పులిరాజు



మహిళా రైతును సన్మానిస్తున్న దృశ్యం

సిద్దిపేట ఎడ్యుకేషన్: వ్యవసాయ రంగంలో పెను మార్పులు చోటుచేసుకున్నప్పటికీ రైతు వ్యక్తిగతంగా సంక్షోభంలో కూరుకుపోతున్నాడని రైతు సంక్షేమ కార్యకర్త పులిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు ఆత్మహత్యలు దేశానికి అశుభమని, రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ జిల్లా కోఆర్డినేటర్ అందె ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులకు అండగా నిలవాలన్నారు. కవి గాయకుడు చీకోడు నర్సింహులు తాను రచించిన పాటలను ఆలపించారు. అనంతరం మహిళా రైతులు సుజాత, భారతమ్మ, చంద్రకళను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, నిర్వాహకుడు అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మల్లేశం, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుజాత, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ ఎస్.మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠ భాగ్యం

- పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు



సిద్దిపేట మోహినిపుర శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో దర్శనానికి వచ్చిన భక్తులు

వర్గల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సుప్రసిద్ధ నాచగిరి, వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాలు, సిద్దిపేట పాత వెంకటేశ్వర దేవాలయం, మోహిని పుర వెంకటేశ్వర దేవాలయం, సత్యనారాయణ స్వామి దేవాలయం, శ్రీసీతారామ సహిత ఆంజనేయ స్వామి ఆలయాలు 'ముక్కోటి'శోభతో అలరారాయి. తెల్లవారుజామున గరుడారూఢులై శ్రీలక్ష్మీ సమేత నృసింహ స్వామివారు నాచగిరి ఉత్తర ద్వారం వద్దకు వేంచేశారు. విద్యాధరి క్షేత్రంలో శ్రీవెంకటేశ్వరస్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సర్వాలంకార శోభితులైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు గరుడ వాహనం అధిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రంలో 30 సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. అలాగే.. వర్గల్ వెంకటేశ్వరాలయంలో ఉత్తరద్వార పూజ అనంతరం 6 గంటల నుంచి వైకుంఠ ఉత్తర ద్వారం గుండా భక్తజనులు శ్రీవారిని దర్శించుకున్నారు. క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. కాగా, సిద్దిపేటలోని మోహినిపూర వెంకటేశ్వర దేవాలయంలోగల ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామివారు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తుల నారాయణ నామస్మరణతో మార్మోగాయి.



మత్స్యావతారంలో మోహినిపుర శ్రీవెంకటేశ్వర స్వామి



వర్గల్ క్షేత్రంలో శ్రీవెంకటేశ్వరుని దివ్యదర్శనం



శ్రీనివాస యోగ మందిరంలో స్వామివారు

మంత్రి పొన్నం పూజలు



వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

హుస్నాబాద్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి, ఎల్లమ్మ దేవాలయాలను మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు దర్శించుకున్నారు. శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు పరమేశ్వర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మేలు జరగాలని ప్రార్థించానన్నారు. మంత్రి వెంట కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వాహణ అధికారి కిషన్ రావు, సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాజేశం తదితరులు ఉన్నారు.

వైకుంఠవాసుడి ఆశీస్సులతో బాగుండాలి

ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వైకుంఠవాసుడి ఆశీస్సులతో ప్రజలు బాగుండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మోహినిపుర, పారుపల్లి పాత వెంకటేశ్వర ఆలయంలో కొలువైన స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి నాడు సిద్దిపేట వెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నారు. రాష్ట్రంలో కరోనా ప్రబలకుండా చూడాలని ప్రార్థించినట్లు చెప్పారు. అలాగే గణేష్ నగర్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయంలో ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రవీందర్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నో బ్యాగ్ డే

- ప్రతీనెల 4వ శనివారం నో బ్యాగ్ డే
- రోజు మాదిరిగానే కొనసాగిన తరగతులు
- 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లాలో 902 ప్రభుత్వ పాఠశాలలు.. 67 వేల మంది విద్యార్థులు



స్కూల్ బ్యాగులతో వస్తున్న సిద్దిపేటలోని మల్టీపర్పస్ హైస్కూల్ విద్యార్థులు

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ పాఠశాలలో నో బ్యాగ్ డే అమలు కావడంలేదు. సాధారణ రోజుల మాదిరిగానే పుస్తకాల బ్యాగ్‌లతోనే నాలుగో శనివారం విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారు. విద్యార్థులపై ఒత్తిడి, బ్యాగులభారాన్ని తగ్గించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా పాఠశాల విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ప్రతీనెలా నాలుగో శనివారాన్ని బ్యాగ్‌లెస్ డేగా అమలు చేస్తోంది. నో బ్యాగ్ డే అమలు తీరుపై శనివారం 'సాక్షి ' క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. విద్యార్థులు సాధారణ రోజుల మాదిరిగానే బ్యాగులతో పాఠశాలకు వచ్చి పాఠాలు విన్న దృశ్యాలు కన్పించాయి. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్ర స్థాయిలో నో బ్యాగ్ అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

10 రోజులు.. 28 రకాల కార్యక్రమాలు

విద్యార్థులు నెలలో వచ్చే ప్రతి నాలుగో శనివారం పాఠశాలకు పుస్తకాల బ్యాగు లేకుండా వచ్చే విధంగా గతంలోనే విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంవత్సరంలో పదిసార్లు నాల్గవ శనివారం వస్తుంది. ఎస్సీఈఆర్టీ ప్రత్యేక బుక్‌లెట్ సైతం ముద్రించి విడుదల చేసింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేలా 28 రకాల కార్యకలాపాలను సూచించారు. విద్యార్థులు బ్యాగ్ లేకుండా పాఠశాలలకు రావాలి. మ్యూజియం, చారిత్రక కట్టడాలు, గ్రామ పంచాయతీ, స్థానిక పీహెచ్‌సీ, సబ్ సెంటర్ సందర్శన వంటి అవుట్ డోర్ యాక్టివిటీస్‌తోపాటు మోడల్ అసెంబ్లీ, మోడల్ ఎన్నికలు వంటి ఇండోర్ కార్యకలాపాలు ప్రతీనెలా నాలుగో శనివారం పాఠశాలల్లో నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది.

జిల్లాలో 902 ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలుండగా 67,454 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాథమిక 568, ప్రాథమికోన్నత 113, ఉన్నత పాఠశాలలు 221 ఉన్నాయి. కొన్ని మండలాలలోని పలు పాఠశాలలను శనివారం సాక్షి పరిశీలించింది.
- సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 167 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శనివారం 120 మంది పాఠశాలకు హాజరయ్యారు. రోజు మాదిరిగానే తరగతులు కొనసాగాయి.
- తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 150 మంది విద్యార్థులుండగా, శనివారం 111 మంది హాజరయ్యారు. నో బ్యాగ్ డే అమలు చేయడం లేదా? అని విద్యార్థులను సాక్షి ప్రశ్నించగా నో బ్యాగ్ డే అంటే తమకు తెలియదని బదులిచ్చారు. రోజు మాదిరిగానే స్కూల్‌కు వచ్చామన్నారు.
- కొముురవెల్లి మండలం మర్రిముచ్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌరయపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు నో బ్యాగ్ డే అమలు చేయలేదు. ప్రతీ రోజు ఆటలు, లైబ్రరీ బుక్స్ రీడింగ్ కార్యక్రమం నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.



సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో చలికి ఎండలో చదువుకుంటున్న విద్యార్థులు

- జగదేవ్‌పూర్ మండలం తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 258 మంది విద్యార్థులున్నారు. శనివారం 136 మంది హాజరయ్యారు. తిమ్మాపూర్ పాఠశాలలో 137 మంది విద్యార్థులకు 103 మంది హాజరయ్యారు. అదే విధంగా మద్దూరు మండలం సలాక్‌పూర్, మరుమాముల, మిరుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైతం నో బ్యాగ్ డే పాటించలేదు.

నో బ్యాగ్ డే జరపడం లేదు

నో బ్యాగ్ డే ఒక్కసారి నిర్వహించారు, మళ్లీ ఇప్పటివరకు చేయలేదు. రోజు మాదిరిగానే స్కూల్‌కు వచ్చాం. విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం అమలు చేయాలి.
– జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి, మిరుదొడ్డి

వచ్చేనెల నుంచి అమలు చేస్తాం



పాఠశాలల్లో నో బ్యాగ్ డేను వచ్చే నెల నుంచి తప్పకుండా అమలు చేస్తాం. ముందుగానే పాఠశాలలకు సమాచారం ఇచ్చి విద్యార్థులు బ్యాగులతో రాకుండా చూస్తాం. ఎస్సీఈఆర్టీ ప్రత్యేక బుక్‌లెట్‌లో పొందుపరిచిన విధంగా 28 అంశాలపై కార్యక్రమాలను నిర్వహించే విధంగా కృషి చేస్తాం.
– శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, చిన్నతనం నుంచే పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి చంద్లాపూర్ శివారు రంగనాయక సాగర్‌పై రాష్ట్రస్థాయి 8వ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. ఆటలతో పాటు విద్యలో ముందుంటే ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడతారన్నారు. సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ క్రీడా పోటీలకు సిద్దిపేట వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. సైక్లింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి సిద్దిపేట రైస్‌మిల్లర్ సంఘం ఆధ్వర్యంలో కొత్త సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ నాగేందర్, సైక్లింగ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఇంటర్ నేషనల్ కోచ్ మ్యాక్స్ వెల్, కార్యదర్శి వెంకటనర్సయ్య, కోచ్‌లు సుజాత, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటఅర్బన్: క్రీడలతో విద్యార్థులకు శారీరక దారుఢ్యం పెరుగుతుందని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని వికాస్ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడా ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.



కేక్ కట్‌చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అన్ని మతాలను గౌరవిస్తాం

- అభివృద్ధి, సేవ, సంస్కారం నిరంతర ప్రక్రియ
- ప్రజల అభిప్రాయం మేరకు మూడు జిల్లాల అంశం నిర్ణయం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: అన్ని మతాలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందని రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లోని లక్ష్మీగార్డెన్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సేవ, సంస్కారం నిరంతర ప్రక్రియ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షలతో ఖరీదైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శ్రీ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి, ప్రగతి నివేదిక, శ్వేత పత్రాలతో ప్రజలకు వాస్తవాలను చెప్పే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ఆరోపణలు చేశారన్నారు. పరిపాలన కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టి విద్య అన్నారు. ఆర్థిక సంక్షోభం ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మున్సిపల్ అభివృద్ధికి కేటాయించిన రూ.25 కోట్లు మంజూరు చేయిస్తానని తెలిపారు.

గౌరవెల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కాలువలు లేవని, నిర్వాసితుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించి రైతులకు సాగునీరందిస్తానని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని, ఏ జిల్లాలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. మూడు జిల్లాల అంశాన్ని ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్రైస్తవుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఆర్డీఓ బెన్‌షాలోమ్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పాస్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సామరస్యానికి సిద్దిపేట నెలవు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అన్నిమతాలకు నెలవు అని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో గాడ్ విజన్ అసోసియేషన్, పాస్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవలో అసోసియేషన్లు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. వారికి తన ఒక నెల వేతనం అందిస్తానన్నారు. నామినేషన్ వేసే ముందు వెంకటేశ్వర స్వామి ఆలయం, గాడ్ సిద్దిపేట చర్చిలో ప్రార్థనలు చేస్తానని గుర్తు చేశారు. సమాజ శ్రేయస్సుకు పాటు పడుతున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతో కలిసి కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వైశ్య సదన్‌లో రిషి ప్రభాకర్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో విశ్వ హృదయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యోగ, ధ్యానంతోనే నిజమైన ఆనందం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. రిషి ప్రభాకర్ గురూజీ మాట్లాడుతూ యోగ, ధ్యానంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ నిత్య ఆనందం, ఆరోగ్యంవైపు అడుగులు వేయాలన్నారు. యోగ చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం హరీశ్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రిషి విద్యాసంస్థల నిర్వాహకులు, ఆధ్యాత్మికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ప్రతిభను కనబర్చినట్లు పేర్కొన్నారు. పాయిల్ విభాగంలో కరణం నిషాంత్, ఈపీ విభాగంలో ముఖేశ్, శ్రీకాంత్, సాబేర్ విభాగంలో జవదుద్దీన్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. వీరంతా ఈనెల 24 నుంచి మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో జరిగే సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



పీఈటీ రాములుతో రమావత్ సోనా

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని రమావత్ సోనా జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం రాంమోహన్‌రావు శనివారం తెలిపారు. కొమురం భీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో ఈ నెల 20 నుంచి 22 తేదీ వరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. అండర్ 14 బాలికల విభాగం ఖోఖో పోటీల్లో రమావత్ సోనా, జన్ముల వర్ష ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రమావత్ సోనా రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో సోనా పాల్గొననుంది. సోనా, పీఈటీ రాములును హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.

మాజీ సైనికులు సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: మాజీ సైనికులు స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎస్.సత్య శ్రీ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో మాజీ సైనికుల ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. వారికి లభించే రాయితీలన్నీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పొందాలన్నారు. వెల్డింగ్ టెస్ట్‌లోని మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ నుంచి వచ్చిన అధికారులు పలు అంశాలను వివరించారు.

వరి గడ్డి.. కడుపు నింపుతోంది

పశుగ్రాసమే వారికి వ్యాపారం
- జీవనోపాధి పొందుతున్న మెదక్ జిల్లా అప్పాజిపల్లి వాసులు
- గ్రామాల్లో కొని హైదరాబాద్‌కు తరలింపు
- రైతులకు ఆదాయంతోపాటు కూలీలకు ఉపాధి

బతుకుబాటలో ఒక్కొక్కరిదీ ఒక్కో దారి.. ఆ దారిలోనే మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామస్తులు గడ్డిపోచలనే తమ జీవనాధారంగా మార్చుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఇదే వారికి ఉపాధి చూపుతోంది. హార్వెస్టర్ల రాకతో కొంతమేర వ్యాపారంపై ప్రభావం పడినా, కొన్ని ఒడిదొడుకులు వచ్చినా. ఎండు గడ్డి వ్యాపారంలో ముందుకు సాగుతున్న ఆ గ్రామవాసులపై ప్రత్యేక కథనం.

-సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలతోపాటు, సమీపంలో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో వరి ఎక్కువగా పండించే గ్రామాలకు వెళ్లి అప్పాజిపల్లివాసులు గడ్డి కొనుగోలు చేస్తారు. సొంత వాహనాలను స్వయంగా నడుపుకుంటూ వెళ్లి గడ్డి తీసుకొస్తారు. ఉదయం 6 గంటలకే ఆయా గ్రామాలకు వెళ్లి గడ్డి లోడ్ చేసుకొని మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటికి చేరుకుంటారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు. గడ్డిని విక్రయించి అన్‌లోడ్ చేసి, తిరిగి అదే రాత్రి ఇంటికి చేరుకుంటారు.

సీజన్‌లో రోజుకు 20 లారీలు

ఖరీఫ్, రబీ వరికోతల నుంచి సీజన్ మొదలవుతుంది. ఖరీఫ్‌లో ఎండు గడ్డి వ్యాపారం నవంబర్ నుంచి జనవరి వరకు, రబీలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉంటుంది. ఆయా సీజన్లలో రోజు 20 లారీల్లో గడ్డిని హైదరాబాద్ తరలిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. మేతకే కాకుండా.. ఇతర అవసరాలకు కూడా గడ్డిని వాడుతుంటారు. గాజు వస్తువులు ప్యాకింగ్ చేసేందుకు ఈ గడ్డిని ఎక్కువగా వాడుతారు. పండ్లు ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు వినియోగిస్తారు. గోశాలలు, గుర్రాలకు మేత కోసం కూడా గడ్డిని విక్రయిస్తారు.

రైతుకు ఆదాయం.. కూలీకి ఉపాధి

గడ్డిని పశుగ్రాసంగా వినియోగించే రైతుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది. వ్యవసాయ పనుల్లో పశువులు వాడకపోవడమే దీనికి ప్రధాన కారణం. చాలా చోట్ల రైతులు వరి కోతల అనంతరం గడ్డిని కాల్చేస్తున్నారు. ఇలా వృథా అయ్యే గడ్డిని వ్యాపారులకు విక్రయించడం ద్వారా రైతుకు ఎకరానికి రూ.2,000 వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 50 నుంచి 60 కట్టల గడ్డి వస్తుంది.ఈ గడ్డి కట్టలు కట్టే కూలీలకు కూడా కట్టకు రూ.20 చొప్పున చెల్లిస్తారు. వరికోత యంత్రాల రాకతో పశువులున్న రైతులే గడ్డిని వినియోగిస్తుండగా, మిగితా రైతులు ఈ గడ్డిపై ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. దీంతో తమకు గిరాకీ తగ్గిపోతుందని గడ్డి వ్యాపారం చేసే అప్పాజిపల్లివాసులు చెబుతున్నారు.



హైదరాబాద్‌కు తరలించేందుకు లారీలో గడ్డి లోడ్ చేస్తున్న వ్యాపారులు



డీసీఎంలో గడ్డి తీసుకెళ్తున్న దృశ్యం



అప్పాజిపల్లి గ్రామం

గిరాకీ బాగా తగ్గింది



చాలా ఏళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్నాను. బాన్సువాడ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గడ్డి కొని హైదరాబాద్ తీసుకెళ్తాం. గతంతో పోల్చితే ఇప్పుడు గిరాకీ లేదు. పశువుల పెంపకం తగ్గిపోవడంతో గతంలో ఉన్నంత డిమాండ్ ఇప్పుడు ఉండడం లేదు. ఒక్కోసారి ఆర్డర్ లేకపోతే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం.

-కన్నెబోయిన వెంకటేశం, గడ్డి వ్యాపారి, అప్పాజిపల్లి

మిషన్ల రాకతో దొరకడం లేదు..



వరికోత మిషన్ల రాకతో గడ్డి సరిగా దొరకడం లేదు. కూలీలతో వరి కోస్తే గడ్డి మంచిగా వస్తుంది. హైదరాబాద్ నుంచి ఆర్డర్లు కూడా తగ్గుతున్నాయి. ఊర్లలో ఒకరిద్దరు గడ్డి కోసం కొనుక్కున్న లారీలను కూడా అమ్మేసుకున్నారు. గడ్డి లోడింగ్, అన్ లోడింగ్‌కు కూలీలు దొరక్క గడ్డి దందాకు ఇబ్బందిగా మారింది.

-కే.శేఖరయ్య, గడ్డి వ్యాపారి, అప్పాజిపల్లి

కేంద్ర పథకాలు వివరించడానికే..



సమావేశంలో మాట్లాడుతున్న శాంతామణి

- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర
- కేంద్ర అదనపు కార్యదర్శి శాంతామణి

పటాన్‌చెరుటౌన్: కేంద్ర గ్రామీణ పథకాలు ప్రజలకు వివరించి, అవగాహన కల్పించడమే 'వికసిత్ భారత్ సంకల్ప్' యాత్ర ముఖ్య ఉద్దేశమని కేంద్ర అదనపు కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప్ నోడల్ అధికారి శాంతామణి (ఐఏఎస్) అన్నారు. శనివారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి శాంతామణి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలందరినీ భాగ్యస్వాములు చేస్తుందన్నారు. మహిళల ఆత్మ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని 10 కోట్ల మందికి మరుగుదొడ్లు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకొని వచ్చారని తెలిపారు. దేశంలోని పేద ప్రజలకు జన్‌ధన్ యోజన పథకం ద్వారా బ్యాంకుల్లో సున్నా అకౌంట్ ఖాతాలు తెరిచి 50 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిచామన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, ఎంపీఓ హరి శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్ కావ్య కాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా కుమార్



నారాయణఖేడ్: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం (ఏఐఎఫ్‌డీఎస్) ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్‌గా నారాయణఖేడ్‌కు చెందిన తెంకటి కుమార్‌ను శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మురళీ, గడ్డం నాగార్జున ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఖేడ్‌లో సంఘం ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెంకటి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక



సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా యువజన ఉత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినీలను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి శనివారం అభినందించి, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు. కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని స్వాతి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మరో విద్యార్థిని తరుణి పోస్టర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, కనకచంద్రం, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, నగేశ్, రఘురాజ్, గంగాధర్, రాజ్యలక్ష్మి, రాజశేఖర్, కౌసర్, సత్యం, భాస్కర్, ఫాతిమా, వెంకటేశ్, నవనీత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ వనరులు దేశాభివృద్ధికి కీలకం

- డాక్టర్.హెచ్‌పీ సింగ్
- కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 9వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌పీ సింగ్

ములుగు(గజ్వేల్): మానవ వనరులు దేశాభివృద్ధికి కీలకమని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్. హెచ్‌పీ సింగ్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 9వ ఆవిర్భావ దినోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు విషయ పరిజ్ఞానం తెలిస్తే రైతులు కీలక విజయాలు సాధిస్తారని తెలిపారు. రైతులు నికర ఆదాయాలు పొందేలా తోడ్పాటు అందించే విశ్వవిద్యాలయాలు, సంస్థలకు గుర్తింపు ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్. ఆర్‌కె మాథుర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంటల సాగుతో అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్. బి.నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యకలాపాలు, సాధించిన విజయాలను వివరించారు. అనంతరం యూనివర్సిటీ రూపొందించిన ఉద్యానదర్శిని మొబైల్ యాప్, ఉద్యాన పంటలకు సంబంధించి అన్ని పంటలపై సమగ్ర సమాచారంతో కూడిన ఈ ఉద్యానదర్శిని, పూలు, కూరగాయలపై రూపొందించిన బులెటిన్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యునివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రైడెంట్' ఆస్తుల వేలం

- నోటీసులు జారీ చేసిన అధికారులు
- జనవరి 10న వేసేందుకు నిర్ణయం
- రైతులకు రూ.9 కోట్ల బకాయిలు
- వచ్చిన డబ్బుతో చెల్లింపు



జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

జహీరాబాద్: గత సీజన్‌కు సంబంధించి ట్రైడెంట్ యాజమాన్యం చెరకు రైతులకు రూ.9 కోట్ల బకాయిలు చెల్లించే విషయంలో జాప్యం చేస్తుండడంతో కర్మాగారం ఆస్తుల వేలానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులకు చెరకు బకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో రెవెన్యూ యాక్ట్ చట్టం అమలు చేసి, దీని ద్వారా కర్మాగారం ఆస్తులను వేలం వేయాలని, వచ్చిన డబ్బులతో రైతులకు బకాయిలు చెల్లించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 11వ తేదీన యాజమాన్యానికి తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. జనవరి 10వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఫారం నంబర్-7 ద్వారా నోటీసులో పేర్కొన్నారు. చెరకు రైతులకు పడిన బకాయిలను చెల్లించాలంటూ పలు మార్లు రెవెన్యూ, చెరకు అభివృద్ధి మండలి అధికారులు యాజమాన్యంపై వత్తిడి చేస్తూ వచ్చారు. ఇప్పటి వరకు ఏడు నోటీసులు జారీ చేస్తూ వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. విధిలేని పరిస్థితుల్లో రెవెన్యూ యాక్ట్ చట్టం ఉపయోగించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ఇచ్చేందుకు గాను వేలం నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

రూ.9 కోట్ల బకాయిలు

'ట్రైడెంట్' కర్మాగారంలో 2022-23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రూ.9 కోట్ల మేర చెరకు బిల్లులను యాజమాన్యం రైతులకు బకాయి పడింది. ఈ సీజన్‌లో 2.55 లక్షల టన్నుల చెరకును కర్మాగారంలో గానుగాడించారు. టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3వేల వంతున చెల్లిస్తూ వచ్చారు. మిగతా రూ.270 పెండింగ్ పెట్టారు. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మాసంలో చెరకును సరఫరా చేసిన రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో బిల్లులు బకాయి పడింది. జోన్ పరిధిలో ఉన్న మొత్తం 2,287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేశారు. ఇందులో 1,699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున బకాయి పడింది. మిగిలిన రైతులకు పూర్తిస్థాయిలో బిల్లులు బకాయి పడింది. రూ.83 కోట్లకు గాను రైతాంగానికి ఇప్పటి వరకు రూ.74 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. ఇంకా రూ.9 కోట్ల మేర బకాయిలను చెల్లించాల్సి ఉందని రైతులు, అధికారులు పేర్కొన్నారు.

అడవి పందిని ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో బోల్తా పడిన కారు

- బోల్తా పడటంతో ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- షిర్డీ యాత్రకు వెళ్తున్న స్నేహితులు
- నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద ఘటన



ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు అడ్డుగా వచ్చిన అడివి పందిని కారు ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద సంగారెడ్డి-నాందేడ్ 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఐదుగురు స్నేహితులు దులపల్లి చంద్రశేఖర్(26), ఫణీందర్(27), చెన్నకేశవులు, బాల మల్లేష్, కిషోర్‌కుమార్ కారులో షిర్డీకి బయల్దేరారు. బాచేపల్లి సమీపంలో అడవి పంది రోడ్డుకు అడ్డు రావడంతో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి బోల్తా పడటంతో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, దులపల్లి చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నలుగురిని చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఫణీందర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన డీసీఎం..

తీవ్రగాయాలై అక్కడికక్కడే వ్యక్తి మృతి



సాయితేజ

పటాన్‌చెరు టౌన్: స్కూటీని డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని తిరుపతికి చెందిన సాయి తేజ(27) బతుకుదెరువు కోసం ఐడీపీఎల్ బాలానగర్‌కి వచ్చి పటాన్‌చెరు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకొని పాశమైలారం నుంచి ఇస్నాపూర్ వైపు స్కూటీపై వెళ్తుండగా మార్గ మధ్యలో డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం వెనుక టైర్ల కింద సాయి తేజ పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శనివారం మృతుడి బావమరిది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌కు చీర చిక్కుకొని..

కిందపడటంతో గాయాలై మహిళ మృతి



భుక్య జుంక(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: బైక్‌పై వెళ్తుండగా వెనుక కూర్చున మహిళ చీర చిక్కుకొని కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం బల్లునాయక్ తండాకు చెందిన భూక్య జుంక(51) కుటుంబం బతుకుదెరువు కోసం కరీంనగర్‌కు వెళ్లి అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల కిందట స్వగ్రామం బల్లునాయక్ తండాకు వచ్చి పొలం పనులు చేసుకున్నారు. కూలీ పనికి వెళ్లాలని శనివారం తెల్లవారుజామున కుమారుడి బైక్‌పై కరీంనగర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌కు చీర చిక్కుకొని రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

సెంట్రింగ్ బాక్స్‌లు తొలగిస్తూ..

మూడో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: సెంట్రింగ్ బాక్స్‌లు తొలగిస్తూ ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అశోక్ నదినే (45) బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఏడాది కిందట అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. ఓ కన్‌స్ట్రక్షన్ వారి వద్ద కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం పనికి వెళ్లిన అశోక్ మూడో అంతస్తులో సెంట్రింగ్ బాక్స్‌లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సైట్ ఇన్‌చార్జి ఆర్‌కే మిశ్రా, సెంట్రింగ్ కాంట్రాక్టర్ మహేశ్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే తన తండ్రి మృతి చెందాడని మృతుడి కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.